# పౌరహక్కుల కోసం ఆందోళన చేద్దాం రండి !

ప్రజలారా !

దేశంలోని పౌరహక్కుల పరిస్థితి గురించి ఆలోచిద్దాం రమ్మని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం మిమ్మల్ని ఆహ్వానిస్తూ ఉంది.

కాశ్మీర్‌లో ప్రతిరోజూ భారతసాయుధ బలగాల చేతిలో కనీసం పదిమంది చనిపోతున్నారు. ఇది అయిదేళ్లుగా ఎడతెరిపి లేకుండా సాగుతున్న హత్యాకాండ. ఈ అయిదేళ్లలో కాశ్మీర్‌లోయలో 20 వేలనుండి 40 వేల మంది దాకా చనిపోయారు. అందులో ముప్పావు వంతు భారతసైన్యం చేతిలో, పావువంతు కాశ్మీర్ మిలిటెంట్ల చేతిలో చనిపోయారు. ఇంకా ప్రతినిత్యం చనిపోతూనే ఉన్నారు.

తమ జాతి స్వాతంత్ర్యం కోసం తాము ఆందోళన చేస్తున్నామనీ తమ భవితవ్యాన్ని స్వేచ్ఛగా నిర్ణయించుకునే స్వయం నిర్ణయాధికారం కోరుకుంటున్నామనీ కాశ్మీరీలు అంటున్నారు. వాళ్లంతా పాకిస్తాన్ ఏజెంట్లనీ దేశ విచ్ఛిన్నకారులనీ భారత ప్రభుత్వం అంటుంది. వాళ్ల స్వేచ్ఛా కాంక్షను ఒక రాజకీయ కాంక్షగా గుర్తించదు. ఒక నేరంగా చిత్రీకరిస్తుంది.

మన లౌకిక ప్రజాతంత్ర రాజ్యంలో ఒక రాష్ట్రమయిన మహారాష్ట్రలో ముస్లింలను విషసర్పాలు అనే వాళ్లు, దేశంలో హిందూరాష్ట్రం ఏర్పాటు చేస్తాం అనే వాళ్లు పరిపాలన సాగిస్తున్నారు. మహారాష్ట్రలోనే కాక, వాళ్ల ఏలుబడిలో ఉన్న ప్రతీ రాష్ట్రంలోనూ ఈ దేశాన్ని గతంలో ఏలిన ముస్లిం పాలకులను జ్ఞాపకానికి తెచ్చే ఊర్ల పేర్లన్నీ మార్చేసి ఈ దేశాన్ని గతంలో ఏలిన హిందూ పాలకుల పేర్లు (లేకపోతే హిందూ దేవుళ్ల పేర్లు) పెడుతున్నారు. మసీదులు కూల్చి గుళ్లు కడతామంటున్నారు.

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 9వ రాష్ట్ర మహాసభలు**

**1996 జనవరి 6-7, మహబూబ్‌నగర్**

**తాజ్ ఫంక్షన్ హాల్, న్యూటౌన్ (మల్లు మాసిరెడ్డి నగర్)**

బీజింగ్‌లో జరిగిన అంతర్జాతీయ మహిళా సదస్సుకు పెద్ద ప్రతినిధి బృందాన్ని పంపిన ఈ దేశంలో ప్రతీ రోజూ ప్రతీ రాష్ట్రంలో ప్రతి ఊరిలో స్త్రీలు లైంగిక అత్యాచారాలకు గురి అవుతున్నారు. కుటుంబం నాలుగు గోడల మధ్య బలవన్మరణాల పాలవుతున్నారు. విద్యారంగంలో, ఉద్యోగాలలో, వృత్తులలో, వ్యాపారాలలో స్త్రీల పురోగమనం నత్తనడక నడుస్తూవుంది. నాలుగేళ్లుగా భారత ప్రభుత్వం ఉద్దేశ్య పూర్వకంగా అనుసరిస్తున్న 'సరళీకరణ' విధానాల వల్ల అది మరింత కఠినం అవుతుంది.

అంటరానితనాన్ని ఆర్టికల్ 17 లో, కుల వివక్షను ఆర్టికల్ 15 లో రద్దుచేసిన భారత రాజ్యంలో హోటళ్లలో దళితులకు వేరే గ్లాసులు పెట్టే ఊర్లు, దళితులు చెప్పులు, చొక్కాలు వేసుకుని తిరగలేని ఊర్లు, ఆత్మగౌరవంతో తలెత్తుకొని బ్రతకలేని ఊర్లు , వేల సంఖ్యలో ఉన్నాయి. పుట్టుకతో కొందరిని ఎక్కువ మానవులుగా కొందరిని తక్కువ మానవులుగా వర్గీకరించిన బ్రాహ్మణీయ హైందవ సంస్కృతి కల్పించిన సాంఘిక అసమానతలు అన్ని రంగాలలోను కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని దళితులు, వెనుకబడిన కులాలు ప్రశ్నించిన చోట వారిపైన పాశవికమయిన దాడులు, హింసాకాండ అమలవుతున్నాయి. ప్రభుత్వ రంగంలో దళిత, వెనుకబడిన కులాలకు రిజర్వేషన్లు కల్పించి అగ్రకుల ఆధిపత్యానికి గండికొడతానని ప్రకటించిన ప్రభుత్వం ప్రభుత్వరంగానికే గండికొట్టి రిజర్వేషన్లకు అర్థం లేకుండా చేస్తూ ఉంది.

సహజ న్యాయ సూత్రాలను గౌరవించే పద్ధతిలో తప్ప ఇతరత్రా ఎవ్వరి స్వేచ్ఛనూ ప్రాణాన్నీ తీసి వేయడానికి వీలు లేదంటూ భారత సుప్రీం కోర్టు విస్తృత వ్యాఖ్యానం ఇచ్చిన ఆర్టికల్ 21ని పునాది చేసుకున్న భారత రాజ్యంలో ప్రతిరోజూ పోలీసు లాకప్పుల్లో వేలాది మందిని చిత్రహింసలకు గురి చేస్తున్నారు. కొట్టి చంపి, దైవదర్శన కాంక్ష మితిమీరిన కారణంగా మృతుడు తానే ఇహలోకాన్ని వదిలి వెళ్లాడని బుకాయిస్తున్నారు. పట్టుకున్న మనుషులను తీసుకుపోయి కాల్చిపారేసి 'ఎన్‌కౌంటర్' జరిగిందంటున్నారు. మన తెలుగు పాలకులయితే బూటకపు ఎన్‌కౌంటర్లు ఇకమీదట జరగవని ఒకవైపు అంటూ, జరిగేవన్నీ నిజమయిన ఎన్‌కౌంటర్లేనని ఏ న్యాయ విచారణా లేకుండ పోలీసులే రాసుకున్న ఎఫ్.ఐ.ఆర్. సాక్షిగా తామే ప్రకటిస్తున్నారు. గత అసెంబ్లీ కాలంలో రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పాలనలో 625 మందిని ఎన్‌కౌంటర్ల పేరిట చంపితే ఇప్పుడు మామా అల్లుళ్ళ ప్రభుత్వాలు 66 మందిని చంపాయి.

కార్మిక సంక్షేమాన్నీ సంక్షేమరాజ్యాన్నీ ఒక ముఖ్యలక్ష్యంగా చూపించి పరిశ్రమలను, బ్యాంకులను, గనులను జాతీయం చేసిన భారత ప్రభుత్వం ఈరోజు సంక్షేమ రాజ్యం అనేది డబ్బుదండుగ వ్యవహారం అని చెప్పి ఆర్థిక పారిశ్రామిక రంగాన్ని యావత్తు దేశీయ విదేశీయ పెట్టుబడిదార్ల పరం చేస్తున్నది. కార్మికులు లక్షల సంఖ్యలో నిరుద్యోగులయి ఇంటి ముఖం పట్టిపోతున్నారు. కార్మిక చట్టాలలో అంతర్జాతీయ ద్రవ్య సంస్థలు కోరిన మార్పులు తీసుకొచ్చి, గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నిటినీ ఒక్కొక్కటిగా నీరుగార్చే విధానాన్ని మనపాలకులు అనుసరిస్తున్నారు. కాశ్మీర్‌లో, పంజాబులో, అస్సాంలో, నాగాలాండ్‌లో దేశ సార్వభౌమత్వం విచ్ఛిన్నమయి పోతున్నదని నిత్యం గోలపెట్టే మన పాలకులు ప్రపంచబ్యాంకు దగ్గర దేశసార్వభౌమత్వాన్ని పాదార్పణం చేయడం తప్పకాకపోగా గొప్ప తెలివయిన విధానం అని మనల్ని నమ్మమంటున్నారు.

జనవరి 6 ఉదయం ప్రారంభ సమావేశంలో :

**ఉమ్మడి పౌరస్మృతా లేక స్త్రీల హక్కులా ?**

**ఇందిరా జైసింగ్**

(సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది)

**కాశ్మీర్‌లో ఏం జరుగుతూ ఉంది ?**

**పర్వేజ్ ఇమ్రోజ్**

(కాశ్మీర్‌కు చెందిన పౌరహక్కుల ఉద్యమకారుడు, శ్రీనగర్ హైకోర్టు న్యాయవాది)

**పౌరహక్కుల ఉద్యమ కర్తవ్యాలు**

**కె.జి. కన్నబిరాన్**

(పి.యు.సి.ఎల్. జాతీయ అధ్యక్షులు)

సామాజిక ఆర్థిక న్యాయం కోసం జరిగిన అనేక పోరాటాల నుండి పుట్టిన చట్టాలలో ఒకటి భూమి పరిమితి (ల్యాండ్ సీలింగ్) చట్టం. దానిని మన పాలకులు అమలులో నలభై ఏళ్లుగా నీరుగార్చింది చాలక, ఇప్పుడు కార్పొరేట్ సేద్యాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సీలింగ్ చట్టాన్నే నీరుగార్చి భూమి కేంద్రీకరణను, ఆర్థిక అవకాశాలలో అసమానతను పెంచే దిశలో ప్రయాణిస్తున్నారు. అడవులలో ఆదివాసీల భూములను బయటి వారినుండి కాపాడే కర్తవ్యాన్ని సక్రమంగా అమలు చేయని మన ప్రభుత్వాలు ఇప్పుడు అడవులలో ఆదివాసీలకు జీవనాధారం పొందే అవకాశాలను పూర్తిగా కుదించి వేసి వాళ్లను నిరుద్యోగ కూలీలుగా మార్చే 'అటవీ సంరక్షణ' విధానాలను చేపడుతున్నారు.

ఇవన్నీ మన సాంఘిక ఆర్థిక రాజకీయ జీవితంలో ప్రజాస్వామ్యానికి సంబంధించిన సమస్యలు. ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం దృష్టిలో పౌరహక్కుల సమస్యలు. వీటి గురించి ఆలోచిద్దాం రమ్మని, ఆందోళన చేద్దాం రమ్మని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం 22 ఏళ్ల క్రితం కార్మిక రైతాంగ ఉద్యమాలపైన ప్రభుత్వం ప్రయోగించే అణచివేత చర్యలను వ్యతిరేకించే సంస్థగా ఆవిర్భవించింది. ఎన్‌కౌంటర్ హత్యలను, అబద్ధపు కుట్ర కేసులను, ఉద్యమాలపైన నిషేధాలను, ఇతర అణచివేత చర్యలను వ్యతిరేకిస్తూ ఆందోళన చేసింది.

ఇప్పటికీ చేస్తూ ఉంది, ఇంకా చేయబోతుంది. ఈ కర్తవ్య నిర్వహణలో మా సంస్థ చాలా నిర్బంధాన్ని అణచివేతనూ ఎదుర్కొనింది. మా సహచరులు నలుగురిని పోగొట్టుకున్నాము. గోపి రాజన్నను హిందూ మతోన్మాదులు హత్య చేశారు. డాక్టర్ రామనాథంను, జాపా లక్ష్మారెడ్డిని, నర్రా ప్రభాకర రెడ్డిని పోలీసులు హతమార్చారు. మాలో చాలా మందిని అబద్ధపు కేసులలో ఇరికించారు. అరెస్టు చేసారు. కిడ్నాప్ చేశారు. గుండాల చేత కొట్టించారు. రేపుకూడ ఈ నిర్బంధాన్ని ఎదుర్కొని రాజ్య హింసకు వ్యతిరేకంగా ఆందోళన చేయడానికి మేము సిద్ధమే.

అయితే ఈ 22 ఏళ్లలో మేము మా కార్యరంగాన్నీ అవగాహననూ అభివృద్ధి చేసుకున్నాము. ఉద్యమాల అణచివేతేకాక అనేక ప్రజాస్వామిక హక్కుల అతిక్రమణ గురించి, విలువల విధ్వంసాన్ని గురించి, వ్యవస్థల వినాశనాన్ని గురించి ఈరోజు ఆందోళన చేస్తున్నాము. అన్నిటినీ జోడించి ఒక సమగ్రమైన పౌరహక్కుల అవగాహన పెంపొందించుకుంటున్నాము.

సాంఘిక ఆర్థిక రాజకీయ జీవితరంగాలన్నింటిలో ప్రజాస్వామిక సంబంధాలు, విలువలు, వ్యవస్థలు, ప్రమాణాలు, సంస్కృతి సంపూర్ణంగా నెలకొన్నప్పుడే దేశంలో ప్రజాస్వామ్యం ఉన్నట్టు అవుతుందని మేము భావిస్తున్నాము. ఆ దిశగా ప్రజలను ఆలోచింపజేయడం, ఆ దిశగా సమాజంలో మార్పుకోసం కృషిచేయడం, మా కర్తవ్యంగా భావిస్తున్నాము. దానికి తగిన ఆచరణను రూపొందించుకుంటున్నాము.

ఈ దశలో మా సంస్థ 9వ రాష్ట్ర మహాసభలు జరుపుకుంటున్నాము. ఆకలి, కరువు, నిరుద్యోగం, అణచివేతలకు నిలయమయిన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరుపుకుంటున్నాము. భారత దేశంలో జీవించే హక్కుకు ఏ గతి పట్టిందంటే మహబూబ్‌నగర్‌ను జవాబుగా చూపించవచ్చు.

ఈ మహాసభలకు సంపూర్ణ సహాయసహకారాలు అందించి విజయవంతం చేయాలనీ, తామందరూ పౌరహక్కుల ఉద్యమంలో భాగస్వాములయి ఉద్యమానికి బలం చేకూర్చాలనీ కోరుకుంటున్నాం.

25 డిసెంబర్ 1995

**ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం**

**(APCLC)**

**జనవరి 7 సాయంత్రం జరిగే ఊరేగింపును, బహిరంగ సభను**

**జయప్రదం చేయండి**